ఇంటింటికీ రామయ్య అక్షింతలు

ఉట్నూర్, జనవరి 6 : ఉట్నూర్ మండల కేంద్రంలో శనివారం ఇంటింటా అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్ సభ్యులు, వీహెచ్పీ సభ్యులు, ఉట్నూర్ హిందూ ఉత్సవ సమితి సభ్యులు, వివిధ ఆలయ కమిటీల సభ్యులు, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

2,24,136 దరఖాస్తులు

మండలం	దరఖాస్తుల
ఆదిలాబాదర్ రూరల్	11,317
బజార్‌హత్నూర్	9559
బేల	12,661
భీంపూర్	8055
బోథ్	14,842
గాదిగూడ	5697
గుడిహత్నూర్	10,209
ఇచ్చోడ	13,849
ఇంద్రవెల్లి	12,276
జైనథ్	17,144
మావల	1809
నార్నూర్	8173
నేరడిగొండ	8475
సిరికొండ	5438
తలమడుగు	11,717
తాంసి	5709
ఉట్నూర్	18,561

ప్రజాపాలనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా 2,24,136 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో ఆదిలాబాద్ మున్సిపాలిటీలోని 49 వార్డుల్లో 48,655.., 17 మండలాల్లో 1,75,481 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు.

ముగిసిన సభలు

నార్నూర్, జనవరి 6 : ప్రజాపాలన సభలు శనివారంతో ముగిసాయి. నార్నూర్ మండలంలోని మలంగి, బలాన్‌పూర్, గాదిగూడ మండలంలోని పర్సువాడ(కే) గ్రామాల్లో సదస్సులు నిర్వహించారు. ఆయాశాఖల అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కావల రమేశ్, తహసీల్దార్ జాడి రాజాలింగు, ఎంపీవోలు సాయిప్రసాద్, రాథోడ్ గంగాధార్, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులు, ఎంపీటీసీ పాల్గొన్నారు.

భీంపూర్‌లో..

భీంపూర్, జనవరి 6 : మండలంలో ప్రజాపాలన సదస్సులు ముగిశాయి. ప్రభుత్వం సమకూర్చిన దరఖాస్తు ఫారాలు సరిపోక ఆయా గ్రామాల్లో రెండో రోజు కూడా కార్యదర్శులు సభలు నిర్వహించారు. దరఖాస్తు ఫారాలపై ప్రజలు అయోమయానికి గురయ్యారు. కాగా, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ హరీశ్ మండలంలో రోజూ రెండు టీంలుగా సభలు నిర్వహించారు. ఎస్ఐ లాల్‌సింగ్‌నాయక్ సిబ్బందితో సభలకు హాజరయ్యారు.

దరఖాస్తుల ఆన్‌లైన్..

బోథ్, జనవరి 6 : మండలంలోని 33 పంచాయతీల్లో వచ్చిన దరఖాస్తుల ఆన్‌లైన్ ప్రక్రియను ప్రారంభించారు. ఎంపీడీవో కార్యాలయం, ఈజీఎస్, తహసీల్దార్ కార్యాలయాల్లో అందుబాటులో ఉన్న కంప్యూటర్ల ద్వారా ఆన్‌లైన్ చేయిస్తున్నారు. ఎంపీడీవో సుశీల్‌రెడ్డితో పాటు ఇతర అధికారులు పరిశీలిస్తున్నారు. మండలంలో మొత్తంగా14,500 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీవో తెలిపారు.

బోథ్‌లో దరఖాస్తులను ఆన్‌లైన్ చేయిస్తున్న ఎంపీడీవో సుశీల్‌రెడ్డి

ప్రభుత్వ జాబితా ప్రకారం 11,500 వరకు దరఖాస్తులు రావల్సి ఉండగా, 3 వేలకు పైగా అదనంగా వచ్చినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వీటన్నింటినీ 17వ తేదీలోగా 25 కంప్యూటర్ల ద్వారా ఆన్‌లైన్ ప్రక్రియ పూర్తిచేయిస్తామని తెలిపారు.

ఆదర్శం.. నిపాని పల్లె దవాఖాన

- పెద్ద సంఖ్యలో చికిత్స పొందుతున్న ప్రజలు
- 14 రకాల పరీక్షలు.. అందుబాటులో 93 రకాల మందులు
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే సౌకర్యాలు..
- జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం సందర్శన
- ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌కు పరిశీలన పూర్తి..

నిపాని వెల్‌నెస్ సెంటర్‌లో పరిశీలన చేస్తున్న ఎన్‌క్వాస్ టీం (ఫైల్)

భీంపూర్, జనవరి 6 : భీంపూర్ మండలం నిపాని పల్లె దవాఖాన (వెల్‌నెస్ సెంటర్) వైద్యసేవల్లో ముందున్నది. అందుకే ప్రజల తాకిడి పెరిగింది. అన్ని విధాలా బాగున్న ఈ పల్లె దవాఖానను జాతీయ నాణ్యతా ప్రమాణాల పరిశీలన బృందం ఇటీవలే సందర్శించి సంతృప్తి చెందింది.

కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే మెరుగైన సౌకర్యాలు..

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ప్రత్యేక శ్రద్ధతో భీంపూర్, తాంసి పీహెచ్‌సీలు సహా వెల్‌నెస్ సెంటర్లలో అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించారు. ప్రణాళికాబద్ధంగా వైద్యాధికారులు, సిబ్బంది గ్రామాల్లో ఆయా వ్యాధుల నియంత్రణకు అవగాహన కల్పించడంతోపాటు, మందులు అందిస్తున్నారు. అందులో భాగంగానే నిపాని పల్లె దవాఖానలో 14 రకాల పరీక్షలు చేస్తున్నారు. అవసరమైతే ఆదిలాబాద్ రిమ్స్‌కు రెఫర్ చేస్తున్నారు. ఆయా వ్యాధుల నియంత్రణ సహా ఇతరత్రా మందులు కలిపి ఇక్కడ మొత్తంగా 93 రకాల మందులు అందుబాటులో ఉంటున్నాయి. ఇక ఇక్కడ క్యాన్సర్‌కు స్క్రీనింగ్ పరీక్షలు కూడా నిర్వహిస్తున్నారు. గర్భిణులు, బాలింతలు, పిల్లల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టారు. వైద్యాధికారి శ్రావ్యవాణి, ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు, ఎంఎల్‌టీహెచ్‌లతో టీం వర్క్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తూ ఫలితాలు సాధిస్తున్నారు.

జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం పరిశీలన..

ఈ పల్లె దవాఖాన గురించి తెలుసుకున్న జాతీయ నాణ్యతా ప్రమాణాల పరిశీలన బృందం ఇటీవలే సందర్శించింది. పరిశీలన పూర్తి చేసింది. వెల్‌నెస్ సెంటర్ పరిసరాల పరిశుభ్రత, మందుల నిల్వ గది, పచ్చదనం, గర్భిణులు, బాలింతల వైద్య పరీక్షలు, సర్కారు దవాఖానల్లోనే ప్రసవాల సంఖ్య, వైద్య సేవల తీరు గురించి ఈ టీం క్షుణ్ణంగా తెలుసుకున్నది. ఈ మేరకు ఈ వెల్‌నెస్ సెంటర్ ఎన్‌క్వాస్ సర్టిఫికెట్‌కు ఎంపికయ్యే అవకాశాలున్నట్లు తెలుస్తున్నది.

టీం వర్క్‌తో ఫలితాలు..

ఈ దవాఖాన తాంసి పీహెచ్‌సీ పరిధిలోకి వస్తుంది. మా పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పల్లె దవాఖానల్లో ప్రత్యేకించి పిల్లలు, గర్భిణులు, బాలింతలపై శ్రద్ధ తీసుకుంటున్నాం. నిపాని పల్లె దవాఖానలో స్థానికుల సహకారంతో అన్ని సౌకర్యాలు కల్పించుకున్నాం. జాతీయ నాణ్యతా ప్రమాణాల బృందం పరిశీలించింది. అన్ని ఉప కేంద్రాలు, వెల్‌నెస్ సెంటర్లలో సేవలు మరింత విస్తృతం చేస్తాం. టీంవర్క్‌తో ఫలితాలు సాధిస్తున్నాం.

- శ్రావ్యవాణి, వైద్యాధికారిణి

నిపానిలో పరీక్షలు చేస్తున్న వైద్యాధికారిణి శ్రావ్యవాణి

పేద, మధ్య తరగతి వర్గాలకు మేలు..

మా పల్లె దవాఖానతో ఇక్కడి పేదలు, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ప్రయోజనం చేకూరుతున్నది. వాస్తవానికి కేసీఆర్ ప్రభుత్వ హయాంలోనే ప్రతి పల్లె దవాఖాన మంచి సేవలందించేలా తయారైంది. సీఎంగా అప్పుడు కేసీఆర్ సార్ ప్రవేశపెట్టిన ఆరోగ్య పథకాలతో అందరూ సర్కారు వైద్యాలయాలవైపే చూస్తున్నారు. నిపాని పల్లెదవాఖానలో డాక్టర్, సిబ్బంది ఎంతో బాధ్యతగా విధులు నిర్వర్తిస్తున్నారు.

- ముకుంద సంతోష్, రైతు, నిపాని

కొలాం ఆదివాసులకు సౌకర్యాలు కల్పించాలి

- శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో

ఇంద్రవెల్లి, జనవరి 6 : జిల్లాలోని కొలాం ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మౌలిక సదుపాయలు కల్పించాలని శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. మండలంలోని గిన్నేరా గ్రామ పంచాయతీ పరిధి కొలాంగూడ గ్రామాల్లో శనివారం ఆయన పర్యటించారు. మౌలిక సదుపాయలతో పాటు, అభివృద్ధి పనులపై సర్వేలు చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన మంత్రి జనజాతి ఆదివాసీ న్యాయ మహా అభియాన్(పీఎం-జేఏఎన్ఎంఎన్) పథకం ద్వారా కొలాం ఆదివాసీ గిరిజన గ్రామాల్లో అన్ని రకాల మౌలిక సదుపాయలు కల్పించాలన్నారు. సీసీరోడ్లు, తాగునీటి, విద్యుత్, మురుగు కాలువలు, పారిశుధ్యం, విద్య, వైద్యం, ఇండ్లు, వ్యక్తిగత రుణాలపై సర్వేలు చేయలన్నారు. సర్వేల్లో అధికారులు గుర్తించిన వివిధ రకాల సమస్యలను పరిష్కరించి, గ్రామంలో అభివృద్ధి పనులు చేసి, మౌలిక వసతులు కల్పించాలని తెలిపారు. ప్రతి ఒక్కరి ఆధార్‌కార్డును వెంటనే అప్‌డేట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆర్కా పూలాబాయి, పంచాయతీ కార్యదర్శి జరీన, అధికారులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

గిన్నేరా గ్రామంలో వైద్య సిబ్బందికి సూచనలు చేస్తున్న శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మహతో

గంగాధర్‌కు సన్మానం..



కొండూరు గంగాధర్‌తో మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్

ఎదులాపురం, జనవరి 6 : నాల్గో తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కొండూరు గంగాధర్ ఇటీవల ఎన్నికయ్యారు. కాగా, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్దన్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. భవిష్యత్‌లో మరినిన పదవులు పొందాలని వారు అకాంక్షించారు. అనంతరం గంగాధర్‌ను పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సత్కరించారు.

దరఖాస్తుల స్వీకరణ

నేరడిగొండ, జనవరి 6 : నేరడిగొండ కేజీబీవీలో తాత్కాలిక పద్ధతిన కుక్‌ల నియామకానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు మండల విద్యాధికారి భూమారెడ్డి తెలిపారు. రెండు హెడ్ కుక్, మూడు అసిస్టెంట్ కుక్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. పదోతరగతి ఉత్తీర్ణత పొందిన మహిళలు ఈ నెల 10లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

డీఎంహెచ్‌వోను కలిసిన సభ్యులు

ఎదులాపురం, జనవరి 6 : ఇటీవల ఎన్నికైన ప్రజా ఆరోగ్య వైద్య, ఉద్యోగుల సంఘం సభ్యులు శనివారం డీఎంహెచ్‌వో నరేందర్ రాథోడ్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ మేరకు పుష్పగుచ్ఛం అందించి, శాలువాతో సత్కరించారు. నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం తమ సమస్యలపై వినతి పత్రం అందజేశారు. ఆయనను కలిసిన వారిలో సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సంతోష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ రవీందర్, జిల్లా గౌరవ అధ్యక్షుడు బాబులాల్, కోశాధికారి అడే సురేశ్, మహిళా సంఘం నాయకురాలు సుశీల, నర్సమ్మ, సీనియర్ నాయకులు ఆనందరావు, రాంరెడ్డి, సచిన్, సుభాష్, శ్రీధర్, గంగాధర్, విష్ణు, రోహిదాస్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ఎదులాపురం, జనవరి 6 : తెలంగాణ కార్మిక సంక్షేమ మండలి కింద అమలవుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని అసిస్టెంట్ లేబర్ కమిషనర్ జీ శ్రావణి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దుకాణాలు, వాణిజ్య సంస్థలు, కర్మాగారాలు, మోటార్ రవాణా సంస్థలు సహకార సంస్థలు, ధార్మిక, ట్రస్టుల్లో పని చేస్తున్న కార్మికులు పిల్లలు అర్హులని పేర్కొన్నారు. వివిధ కోర్సుల్లో 2022-23 విద్యా సంవత్సరంలో ఉత్తీర్ణులై, ప్రతిభ ఆధారంగా ఉపకార వేతనల కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు ఫారాలను సహాయ కార్మిక శాఖ కార్యాలయంలో పొందవచ్చునని, పిబ్రవరి 15లోగా దరఖాస్తులు సమర్పించాలని తెలిపారు. ఎంపికైన వారికి లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాలో డబ్బు జమచేస్తామని తెలిపారు.

జిన్నింగ్ మిల్లులో అగ్ని ప్రమాదం

బోథ్, జనవరి 6 : బోథ్‌లోని సాయిదత్తా జిన్నింగ్ మిల్లులో శనివారం అగ్ని ప్రమాదం సంభవించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. రోజువారిగా మిల్లులో పత్తిని జిన్నింగ్ చేస్తున్నారు. గింజలు, పత్తి బెండల్ వేరు చేసిన అనంతరం డస్ట్‌రూం వద్దకు పత్తిని మోసుకెళుతున్న బెల్టులో నిప్పు రవ్వలు ఎగిసి ప్రమాదవశాత్తు మంటలు వ్యాపించాయి. ఒక్కసారిగా దట్టమైన పొగ రావడంతో కూలీలు కేకలు వేశారు. అందరూ వచ్చి సంప్‌లో ఉన్న నీటితో పైపుల ద్వారా మంటలను అదుపులోకి తెచ్చారు. ఈ ప్రమాదంలో సుమారు 50 క్వింటాళ్ల వరకు పత్తి దగ్ధమైనట్లు యజమానులు తెలిపారు.

వాలీబాల్ కిట్ అందజేత

వాలీబాల్ కిట్ అందజేస్తున్న మాసం అనిల్

బోథ్, జనవరి 6 : బోథ్‌లోని మైసమ్మ కాలనీకి చెందిన యువకులకు శనివారం మాసం లక్ష్మీ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో వాలీబాల్ కిట్ అందజేశారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ మాసం అనిల్ మాట్లాడుతూ.. యువత చదవుతో పాటు ఆటలపైనా దృష్టిపెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సభ్యులు జటాల శ్రీధర్, కార్తీక్, రాజు, సాయిచరణ్, హనుమంత్, తేజ, తమన్, రాజేందర్, మహేష్, మణికంఠ, వినయ్, అజయ్, మనీష్ పాల్గొన్నారు.

సిరిచెల్మకు ఆర్టీసీ బస్సు ప్రారంభం

ఇచ్చోడ, జనవరి 6 : మండలంలోని సిరిచెల్మ గ్రామానికి శనివారం ఇచ్చోడ నుంచి బస్సు సర్వీస్ ప్రారంభించారు. గ్రామస్తులు, స్థానిక నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. సర్పంచ్ లక్ష్మీకన్నమయ్య, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

ఎదులాపురం, జనవరి 6 : ఆదిలాబాద్ రూరల్ పరిధిలో జరిగిన ఓ హత్యకేసులో నిందితులుగా ఉన్నవారికి మద్యం ఇచ్చే ప్రయత్నం చేసిన ఎరకుమ్ర రాజు, రాకేశ్‌పై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ ఏ అశోక్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. హత్యకేసులో నిందితులుగా ఉన్నవారు శనివారం జిల్లా కోర్టుకు ఎస్కార్ట్‌తో హాజరయ్యారు. ఈ క్రమంలో వారిని కలిసేందుకు వచ్చిన ఎరకుమ్ర రాజు, రాకేశ్ నిందితులకు వాటర్ బాటిల్ ఇచ్చారు. అయితే అందులో మద్యం కలిపి ఉన్నట్లు అనుమానం వచ్చిన పోలీసులు ఆ బాటిల్ తిసి చూడగా, అందులో మద్యం ఉన్నట్లు తేలింది. దీంతో పోలీసులు మద్యం తెచ్చిన సేహ్నితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపించారు.

మద్యం కలిపిన వాటర్ బాటిల్ ఇదే

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న స్టేషన్ ఫైర్ ఆఫీసర్ శివాజీ

ఎదులాపురం, జనవరి 6 : విద్యార్థి దశ నుంచే అగ్ని ప్రమాదల నివారణపై అవగాహన కలిగి ఉండాలని స్టేషన్ ఫైర్ ఆఫీసర్ డీ శివాజీ అన్నారు. ధర్మ విద్యాలయం విద్యార్థులకు శనివారం ఫైర్ సెఫ్టీపై అవగాహన కల్పించారు. కార్యాలయంలోని అగ్నిమాపక సిబ్బంది విధులు, వాహనాలు పనిచేసి తీరును విద్యార్థులకు తెలియజేశారు. ప్రమాదం సంభవిస్తే ఎలా వ్యవహరించాలో వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అగ్ని ప్రమాదాలను నివారించడంతో పాటు అవగాహన కల్పించేలా కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే వారంలో ఒక రోజు పాఠశాలలో కార్యక్రమం నిర్వహించి, ప్రమాదల గురించి వివరిస్తున్నటుల చెప్పారు. ప్రమాదాలు జరిగినప్పుడు భయపకుండా ముందుగా ఫైర్ టోల్‌ఫ్రీ నంబర్ 101కు ఫోన్ చేసి, సరైన చిరునామా చెప్పాలని సూచించారు. కొంత మంది సరైన చిరునామా చెప్పకపోవడంతో సమయానికి అక్కడికి వెళ్లలేకపోతున్నామని తెలిపారు. అప్పటికే ఆస్తి, ప్రాణ నష్టం జరిగిపోతున్నదని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించాలని సూచించారు.



మాట్లాడుతున్న టీఏజీఎస్ జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు

ఆదివాసీ హక్కులు హరించే కుట్ర

ఇంద్రవెల్లి, జనవరి 6 : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ఆదివాసుల హక్కులతో పాటు, రాజ్యాంగ వారికి కల్పించిన చట్టాలను పూర్తిగా నిర్వీర్యం చేసేందుకు కుట్రలు పన్నుతున్నదని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయిక విష్ణు అన్నారు. మండలంలోని పిప్రి గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణలో భాగంగా దేశంలోని అడవులను కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టే విధానాలతో షెడ్యూల్డ్ ప్రాంతాన్ని హరిస్తున్నదని ఆరోపించారు. 20 కోట్ల ఆదివాసులను ప్రమాదంలో నెట్టిందనానరు. బీజేపీని గద్దె దించే వరకు ఆదివాసులు పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింగ్‌రావ్, శంభు, విఠల్, నాగోరావ్, జలపతి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఐక్యంగా ఉండాలి

ఎదులాపురం, జనవరి 6 : మైనార్టీ పాఠశాలలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి అందరూ ఐక్యంగా ఉండాల్సిన అవసరం ఉందని తెలంగాణ మైనార్టీ ప్రైవేట్ రికగ్నైజ్ స్కూల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఇక్బాల్‌ఖాన్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కార్యవర్గంలో జిల్లా అధ్యక్షుడిగా మహ్మద్ అమీరొద్దీన్, ఉపాధ్యక్షుడిగా మహ్మద్ ముజాయిద్, జనరల్ సెక్రటరీగా ఫైసల్‌బిన్ వాహబ్, జాయింట్ సెక్రటరీగా మహ్మద్ అబ్దుల్ మేరజ్, కోశాధికారిగా తన్వీర్ పరేఖ్, కార్యవర్గ సభ్యులుగా ఇజాజ్ అహ్మద్, జాఫర్ ఖాన్, మహ్మద్ రోషన్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇక్బాల్‌ఖాన్ మాట్లాడుతూ.. మైనార్టీ విద్యాసంస్థల బాధ్యులను ఒకే వేదికపైకి తీసుకురావాలన్నారు. అందుకు జిల్లాస్థాయిలో యూనియన్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి

- బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్
- ఇచ్చోడ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాల సందర్శన

ఇచ్చోడ, జనవరి 6 : పాఠశాలల్లో విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఇచ్చోడ మైనారిటీ రెసిడెన్షియల్ కళాశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని భోజన వసతి, తరగతి గదులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీలు ప్రీతంరెడ్డి, తుల శ్రీనివాస్, మండల కన్వీనర్ కృష్ణారెడ్డి, రవీంధర్‌రెడ్డి, మైనారిటీ మండల నాయకులు, కళాశాల ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.

కళాశాలలో భోజనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

సోషల్ మీడియాపై అవగాహన ఉండాలి

ఎదులాపురం, జనవరి 6 : సోషల్ మీడియా వల్ల జరుగుతున్న అనర్థాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. ఆదిలాబాద్ రూరల్ మండలం చించుగాట్ ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలో శనివారం బేటీ బచావో-బేటీ పడావోపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాలు, ఫోక్సో చట్టం, హక్కులు, సేఫ్‌టచ్, అన్‌సేఫ్ టచ్‌లను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జెండర్ స్పెషలిస్టు కోటేశ్వర్, ఆర్థిక అక్షరాస్యతా నిపుణుడు నిఖిల్, ఉపాధ్యాయులు గోవింద్, రవి, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులతో జిల్లా మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి

రిసెప్షన్ గది ప్రారంభం

ఇచ్చోడ, జనవరి 6 : ఇచ్చోడ పోలీస్‌సేష్టన్‌లో నూతనంగా నిర్మించిన రిసెప్షన్ గదిని శనివారం సీఐ చంద్రకాంత్‌తో కలిసి ఉట్నూర్ డీఎస్పీ నాగెందర్ ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. గదులు చిన్నగా ఉండడంతో నూతనంగా రిసెప్షన్ గది నిర్మించినట్లు పోలీసులు తెలిపారు. గుడిహత్నూర్, ఇచ్చోడ, సిరికొండ ఎస్ఐలు ఇమ్రాన్, నరేశ్, శ్రీకాంత్ తెలిపారు.

రిసెప్షన్ గదిని ప్రారంభిస్తున్న డీఎస్పీ నాగెందర్

గిరిజనులకు బ్లాంకెట్ల పంపిణీ

ఎదులాపురం, జనవరి 6 : ఆదిలాబాద్ రూరల్ మండలం కొలంగూడ, గుండంలోద్ది గ్రామాల్లోని గిరిజనులకు శనివారం కాలభైరవ చారిటబుల్ ఫౌండేషన్ తరుపున బ్లాంకెట్లు పంపిణీ చేశారు. ఈ ఫౌండేషన్ సభ్యుడు సందీప్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనేక రకాల సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. గ్రామ పటేల్ రాము ఫౌండేషన్ సభ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మామిడి వెంకన్న, ఐతే గంగాధర్, జలెందర్, అరుణ్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All
OWN BUSINESS OFFER
★18-28 సం॥ల యువతీ యువకులకు Rs. 49,000/- ల స్వల్ప పెట్టుబడిలోనే లోకల్ ఫ్రాంచైజీతో పర్మినెంట్ బిజినెస్ ఆదాయం. మల్టీసర్వీసెస్+ట్రైనింగ్+డైలీ సపోర్ట్ @ 15 సం॥ల నమ్మకమైన సర్టిఫైడ్ సంస్థ W.W.I-Hyd. Ph: 9908743603.
NT-2580-All
గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.
Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
బెల్లంపల్లి: 91827 77671, 91827 77677